క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. హెచ్‌ఎం డి.ధర్మానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) చైర్మన్ భవాని, ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్ నాయక్, ఉపేందర్, ముంతాజ్‌బేగం, ధావురియా, సంతోష్, అనిత,జ్యోతి, ధనలక్ష్మి, అశ్విని, స్పందన, వినోద, వెంకటరమణారెడ్డి, మంగమ్మ, బేబిరాణి, సీమా, సుప్రజా, నస్రిస్, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డిండి నీటి విడుదల

డిండి: మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు నుంచి వానాకాలం సాగుకు ఆయకట్టు పొలాలకు శుక్రవారం నీటిని విడుదల చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

డిండి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డానియల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండలాధికారులు ఉదయం 11 గంటలలోపు తమ నివేదికలతో విధిగా హాజరు కావాలని కోరారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి

డిండి: వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి హెచ్చరించారు. గురువారం డిండి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను మండల వైద్యాధికారి ఎస్.శైలిని అడిగి తెలుసుకున్నారు.

రామాలయంలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని రామాలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు, వెండి వస్తువులు అపహరించారు. ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు బుధరవారం అర్ధరాత్రి రామాలయం తలుపులు పగులగొట్టి ఆలయంలోని సుమారు 4కేజీల వెండి వస్తువులతో పాటు మరికొన్ని బంగారు ఆభరణాలను దొంగలించారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నల్లగొండ నుంచి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్: దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని బంజార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, జిల్లా నాయకులు మాన్యానాయక్, సీతారాంనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 10శాతం ఉన్న గిరిజనులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు కృష్ణానాయక్, నానినాయక్, రామచంద్రునాయక్, శ్రీనునాయక్ తదితరులున్నారు.

స్వచ్ఛత అంతంతమాత్రమే!

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపం
- సిబ్బంది కొరతతో ఎక్కడి చెత్త అక్కడే
- డ్రైయినేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తం
- కంపుకొడుతున్న వివిధ వార్డులు
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు


మిర్యాలగూడ పట్టణంలోని ఓ కాలనీలో పేరుకుపోయిన చెత్త


విద్యానగర్‌లో డ్రైయినేజీ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సిబ్బంది కొరతతో వివిధ వార్డుల్లో డ్రైయినేజీలు శుభ్రం చేసేవారు లేకుండా పోయారు. దీంతో మురుగునీరు వీధుల్లో పారుతోంది. దీనికితోడు ఎక్కడి చెత్త అక్కడే రోజుల తరబడి నిలిచి ఉంటోంది. వీధుల్లో ఉన్న కుప్పలుగా ఉన్న చెత్త గాలికి లేచి పరిసర ప్రాంతాల్లో పడుతుందని ప్రజలు అంటున్నారు. ఒకవైపు చెత్తకుప్పలు, మరోవైపు మురుగు నీటితో దుర్వాసనం వస్తోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ×స్వచ్ఛత పక్వాడ« పేరుతో వారోత్సవాలను నిర్వహిస్తున్నా.. అవి నామమాత్రంగానే మారుతున్నాయి. ఫలితంగా చెత్త, మురుగునీటితో ఇబ్బందులు తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండడంతో ఏ పనులు కూడా సరిగా జరగడం లేదు. మున్సిపాలిటీలో 48 వార్డులుండగా గతంలో రెండు విభాగాలను ఏర్పాటు చేసి వన్ టౌన్, టూ టౌన్ పరిధిల్లో ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. అయితే వీరిలో ప్రస్తుతం ఒకరు మాత్రమే విధుల్లో కొనసాగుతున్నారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది 267 మంది మాత్రమే ఉండగా వీరిలో కొందరు ప్రజా ప్రతినిధుల నివాసాల్లో పనులను చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో పూర్తి స్థాయిలో శానిటేషన్ విభాగంలో సిబ్బంది లేక మున్సిపాలిటీలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణ ప్రణాళిక విభాగంలోనూ ఇద్దరు టీపీఎస్‌లకు ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. దీంతో అనుమతులు లేని లే అవుట్లు వెలుస్తూ మురుగుకూపాలుగా దర్శనమిస్తున్నాయి. నీటి సరఫరా విభాగంలో డీఈ, ఏఈలు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండడంతో వారు మూడు రోజులకు ఒక్కసారి వచ్చివెళ్తుండడంతో నీటి సరఫరాపై సరైన పర్యవేక్షణ కరువైంది. ఇదిలా ఉంటే వీలిన గ్రామాల్లోనూ మురుగు, చెత్త సమస్యలు వేధిస్తున్నాయని, శుభ్రం చేసే సిబ్బంది సరిగ్గా రావడం లేదని పట్టణంలోని వివిధ వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగనివ్వం



మున్సిపాలిటీలో సరిపడా సిబ్బంది లేకున్నా.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. డ్రైయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం. ఏ సమస్య వచ్చినా ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలి. మా పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

సికిల్ సెల్ అనీమియా.. అంటువ్యాధి కాదు


పెద్దవూర ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న డాక్టర్ నగేష్

పెద్దవూర: సికిల్ సెల్ అనీమియా అనేది అంటువ్యాధి కాదని, కేవలం తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించి మాట్లాడారు. రక్తకణాల తగ్గుదల, కళ్లు పసుపు రంగులోకి మారుతాయని, శరీరం, కీళ్లలో తీవ్రమైన నొప్పులు, ఊపిరి ఆడకపోవడం, ఆయాసం వంటివి సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాలని అన్నారు. ఇది గిరిజన జనాభాలో ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.బాలోజీ, వార్డెన్ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు సురేందర్, రామయ్య, షాహీన్ బేగం, ఏఎన్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసిక ఉల్లాసం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


బోయగూడెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): క్రీడాపోటీలతో మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఎంసీకేఆర్ యువసేన ఆధ్వర్యంలో తిరుమలగిరినాగార్జునసాగర్ మండలం బోయగూడెంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యం కూడా సమకూరుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన యువకులతో కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నాయకులు అల్లి పెద్దిరాజు, బొల్లేపల్లి రమణరాజు, కృష్ణారెడ్డి, కృష్ణప్రసాద్, రేణు, కిషోర్, లింగారెడ్డి, సత్యంరెడ్డి, దుర్గారెడ్డి, రవీంద్రాచారి, నాగార్జున, రవీందర్‌రెడ్డి, మల్లయ్య, శ్రావణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు


మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

పెద్దవూర: చదువుకు పేదరికం అడ్డుకాదని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. గురువారం పెద్దవూర మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామచంద్రరావు, పెద్దవూర ఎస్‌ఐ పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 1, వాణిజ్యశాస్త్రం 2, కంప్యూటర్ సైన్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టులో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉంటే అర్హులని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీతో పాటు బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వచ్చే నెల 3వ తేదీ సాయంత్రం 4:30 గంటలలోపు తమ దరఖాస్తు ఫారాలను కళాశాలలో సమర్పించాలని తెలిపారు. ఇంటర్వ్యూ తేదీలను త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

దేవరకొండ ఎంకేఆర్ కళాశాలలో నాలుగు పోస్టులకు..

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్-1, తెలుగు-1, జువాలజీ-1, కంప్యూట ర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ -1 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు వస్తున్నాయని ఆందోళన


ఆందోళన చేస్తున్న వినియోగదారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

నిడమనూరు: మండల కేంద్రంలోని హెచ్‌పీ బంకులో పెట్రోల్ పోయించుకుంటే సగం వరకు నీళ్లు వస్తున్నాయని వినియోగదారులు ఆరోపించారు. శోభన్ అనే యువకుడు తన బైక్‌లో పెట్రోల్ పోయించుకోగా కొంతదూరం వెళ్లగానే బైక్ ఆగిపోయింది. దీంతో మోకానిక్‌కు చూపిస్తే ట్యాంకు నుంచి పెట్రోల్‌తోపాటు నీళ్లు వచ్చాయి. దీంతో గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బొజ్జ చిన్న ఆధ్వర్యంలో బంకు వద్ద పలువురు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపాలరావు అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పి ఆందోళన విరమింపజేశారు. ఆందోళన కారులు విషయాన్ని తహసీల్దార్ కృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన బంకు నిర్వాహకునితో మాట్లాడారు. వర్షం వల్ల నీళ్లు వచ్చి ఉంటాయని బంకు నిర్వాహకుడు వివరణ ఇవ్వగా మరోసారి ఇలా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ప్రైవేట్'లో ఫీజుల దోపిడీని అరికట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ కోరారు. గురువారం దామరచర్లకు వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతోపాటు నోట్ పుస్తకాలు, టై బెల్ట్ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్, బీసీ నాయకులు సందాల శంభయ్యమాదిగ, ఎర్రమాద కుమార్, కంభంపాటి నాగరాజు, శ్రీకాంత్, బాలు, సైదారాజు పాల్గొన్నారు.

నూతన కేజీబీవీని ప్రారంభించాలి


మాట్లాడుతున్న మహేష్ గౌడ్

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీని) ప్రారంభించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత బిల్డింగ్‌లో సరైన వసతులు లేకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మంచినీటి సౌకర్యంతో పాటు బాత్‌రూమ్‌లు కూడా సరిగా లేవన్నారు. నూతన భవనంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి తక్షణమే భవనాన్ని వినియోగంలోకి తెచ్చి విద్యార్థినుల ఇబ్బందులు తొలగించాలన్నారు. ఈ సమావేశంలో జబ్బార్ , ముని, రమేష్, లస్కర్, రాజేష్, కృష్ణ, శంకర్, అనిల్, అభిరామ్, యాదగిరి, శ్రీనాథ్ తదితరులున్నారు.

ట్రాన్స్‌కో డీఈగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ


డీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ట్రాన్స్‌కో డీఈగా ఏ.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల పట్టణంలో ట్రాన్స్‌కో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. అయితే ఇక్కడ పనిచేసిన ఐతగాని వెంకటేశ్వర్లు మార్చిలో బదిలీ కావడంతో ఎస్.వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీఈగా వ్యవహరిస్తున్నారు. కాగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీఈ శ్రీనివాస్‌కు పలువురు ఉద్యోగులు పూలమాల వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పదోన్నతులపై ఉపాధ్యాయుల హర్షం


పాఠశాల ఉపాధ్యాయులకు రిలీవ్ ఉత్తర్వులు అందజేస్తున్న హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు

కొండమల్లేపల్లి: దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న పండిట్, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించడం పట్ల కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాల హెచ్‌ఎం ఆర్.నాగేశ్వర్‌రావు పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన సీతారాం, గిరిశ్రీనయ్య, నాగరాజు, రమాదేవి, కవిత, మంజుల తదితరులకు పాఠశాల నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, అశోక్‌కుమార్, కట్టెబోయిన శ్రీనివాసులు, సైదానాయక్, యాదయ్య, సుధాకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

30న ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 30న పట్టణంలోని అభ్యాస్ టెక్నో స్కూల్‌లో మర్రి ఎలియాస్, నక్క శ్రీనివాస్, పగిళ్ల వెంకన్న, గుగులోతు పాండు, ఎం సతీష్ పర్యవేక్షణలో జరుగనున్నాయి. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో 350 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొదటి ప్యానల్‌లో అసోసియేషన్ అధ్యక్షుడిగా గంధం నాగరాజు(చక్రి), ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మణ్, కోశాధికారిగా నాగార్జున, రెండో ప్యానల్‌లో అధ్యక్షుడిగా పురం జానయ్య, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా ఈశ్వర్, మూడో ప్యానల్‌లో అధ్యక్షుడిగా కట్టా సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా సైదులు పోటీ పడుతున్నారు.

ఇటుక బట్టీలకు చెరువు ఒండ్రు మట్టి..

- యథేచ్ఛగా తరలిస్తున్న వ్యాపారులు
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు


రాత్రి సమయంలో నసర్లపల్లి చెరువు నుంచి టిప్పర్‌లో తరలిస్తున్న ఒండ్రుమట్టి

చింతపల్లి: గ్రామీణ చెరువుల్లోని ఒండ్రు మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రంతో పాటు నసర్లపల్లి, వెంకటంపేట, గడియగౌరారం, తిరుమలాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలకు ఆయా గ్రామాల పరిధిలోని చెరువుల్లో ఒండ్రుమట్టిని తవ్వి రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్ల ద్వారా తీసుకెళ్తున్నారు. అధికారులు, పోలీసుల అండదండలతోనే నెల రోజుల నుంచి ఈ వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మట్టిని తరలిస్తున్న టిప్పర్ల రాకపోకలతో గ్రామాల్లోని లింకు రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని, స్పందించి మట్టిని తరలించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతి లేకుండా ఇసుక రవాణా చేయొద్దు


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

వేములపల్లి: ప్రభుత్వ అనుమతి లేకుండా మండల పరిధిలోని పాలేరు, మూసీ వాగుల నుంచి ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేయొద్దని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం వేములపల్లి మండలం సల్కునూరు, రావులపెంట గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాపై, మాదక ద్రవ్యాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల బారిన పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, అంకెపాక రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

చింతపల్లి: వింజమూరు గ్రామం నుంచి స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం గతంలో ఉన్న బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి ఉన్న బస్సు సర్వీస్‌ను యథావిధిగా కొనసాగించాలని డిపో మేనేజర్‌కు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


విద్యుదాఘాతంతో మృతిచెందిన ఆవు

నిడమనూరు: మండలంలోని బొక్కమంతులపాడు వద్ద బుధవారం మధ్యాహ్నం నీరు తాగేందుకు వెళ్లి ఓ ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. బాధిత రైతు మట్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన రాం మట్టయ్య తన పశువులను మేపేందుకు రోజు వారీగా బొక్కమంతులపాడు వైపు తీసుకెళ్లాడు. ఇందులోని ఒక ఆవు నీటి కోసం వెళ్తూ వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. తనకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మట్టయ్య కోరుతున్నాడు.

పంట పొలాల్లో కోళ్ల వ్యర్థాలు


గడియగౌరారం సమీపంలోని పొలంలో పారబోసిన కోళ్ల వ్యర్థాలు

చింతపల్లి: మండలంలోని గడియగౌరారం గ్రామానికి సమీపంలో గల ఓ కోళ్ల ఫారం యాజమాన్యం తమ ఫాంలో మృతి చెందిన కోళ్లతోపాటు ఇతర వ్యర్థాలను పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లో పడేస్తున్నారు. అక్కడ దుర్వాసన వస్తుండడంతో పాటు కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో తెల్లవారుజామున అక్కడ నుంచి తమ పొలాలకు వెళ్లాలంటే కుక్కలతో భయమేస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జన సంచారం లేనిచోట కోళ్లను పూడ్చి పెట్టాల్సి ఉండగా యాజమాన్యం పట్టించుకోకుండా పంట పొలాల్లో వేయడమేంటని రైతులు అంటున్నారు. కోళ్ల వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు దాడి చేస్తున్నాయని, ఇప్పటికే రెండు ఆవు దూడలు మృతి చెందినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొలాల్లో కోళ్లఫాం వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎట్టకేలకు ప్రత్యామ్నాయ రోడ్డు

- నక్కలగండి ప్రాజెక్టు కట్ట నిర్మాణంతో రోడ్డు కష్టాలు
- ఎనిమిదేళ్లుగా పది గ్రామాలకు సరైన దారిలేని దుస్థితి
- ప్రజల డిమాండ్‌తో రోడ్డు నిర్మాణానికి మొదలైన సర్వే
- పనులు పూర్తయితే తీరనున్న ఇక్కట్లు


కొత్త రోడ్డు నిర్మాణానికి సర్వే చేపడుతున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

చందంపేట: మండలంలోని నక్కలగండి ప్రాంతంలో సుమారు ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన నక్కలగండి ప్రాజెక్టు కట్టతో ఇరువైపులా ఉన్న గ్రామాలకు సరైన రోడ్డు లేకుండా పోయింది. దీంతో అప్పటి నుంచి వివిధ గ్రామాల ప్రజలు కట్ట వెంట డొంకదారులు చేసుకొని నానా ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. తమ ఇబ్బందులు గమనించి ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించాలని ఏళ్ల తరబడి ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. పలుమార్లు ధర్నాలు, నిరసనలు సైతం తెలిపారు. దీనికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించేందుకు ఇటీవలే సర్వే పనులు మొదలుపెట్టారు.

ప్రజలకు తప్పని ఇబ్బందులు

చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి సమీపంలో నక్కలగండి కట్ట నిర్మాణం చేపట్టారు. పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. కాగా ఈ నిర్మాణంతో నక్కలగండి కట్టకు అవతలి గ్రామాలైన తెల్దేవర్‌పల్లి, మోత్యతండా, పాత తెల్దేవర్‌పల్లి, బొల్లారం, దేవరచర్ల, యల్మలమంద, పాత కంబాలపల్లి, కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాల ప్రజలు కోరుట్ల మీదుగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కానీ, నక్కలగండి కట్ట నిర్మాణంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన రోడ్డు లేకపోవడంతో యల్మలమంద, పాతకంబాలపల్లి, కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాలు చిత్రియాల మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో అదనపు దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

రూ.70 కోట్లతో నిర్మాణ పనులు

నక్కలగండి కట్ట నిర్మాణంతో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు దష్ట్యా ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టారు. సుమారు రూ.70కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా రోడ్డు నిర్మాణం కోసం సర్వే పనులు చేస్తున్నారు. కాగా సర్వే చేపట్టే ప్రాంతం అటవీ శాఖ ఆధీనంలో ఉండడంతో అటవీ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సర్వే చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నారు.

అటవీ శాఖ అనుమతులు రావాల్సి ఉంది



నక్కలగండి కట్ట నిర్మాణంతో వివిధ గ్రామాల ప్రజలు పడే ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.70కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి సర్వే చేపడుతున్నాం. అయితే సర్వే చేపట్టే ప్రాంతం అటవీ శాఖ ఆధీనంలో ఉండడంతో ఆ శాఖ అనుమతులు రావాల్సి ఉంది. సర్వే చేపట్టిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– చక్రపాణి, డీఈ, ఇరిగేషన్ శాఖ